విలేకరులు కావలెను

హిందుస్థాన్ మీడియా తెలుగు దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ రాష్ట్రాలలో జిల్లా రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జులు, మండలాలవారిగా విలేకరులు కావలెను. అనుభవం కలవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సంప్రదించండి
9000306455



hindustanmedia333@gmail.com APTEL / 2004 / 19136

# హిందుస్థాన్ మీడియా

తెలుగు దిన పత్రిక

సామాన్యుడి నేస్తం








ఎడిటర్ : తాడెం. ప్రశాంత్ సిద్దిపేట సంపుటి : 1 సంచిక : 52 శనివారం 20 జూన్ 2026, పేజీలు - 4 వెల :2/-


# తెలంగాణలో మూడు రోజులు రిజిస్ట్రేషన్లు బంద్.. ఎప్పుడంటే?

-సర్వర్ మెయింటెనెన్స్ కారణంగా జూన్ 26 నుంచి 28 వరకు బంద్

-ప్రజలకు ఇబ్బంది కలగకుండా సెలవు రోజుల్లో నిర్వహణ పనులు

-ఐదేళ్లలో ఇదే మొదటి ప్రధాన అప్‌గ్రేడ్ అని తెలిపిన అధికారులు

-జూన్ 29 నుంచి యథావిధిగా సేవలు పునఃప్రారంభం

హిందుస్థాన్ మీడియా

తెలంగాణవ్యాప్తంగా ఆస్తుల రిజిస్ట్రేషన్లు, ఇతర అనుబంధ ఆన్‌లైన్ సేవలు మూడు రోజుల పాటు నిలిచిపోనున్నాయి. సర్వర్ల నిర్వహణ, అప్‌గ్రేడేషన్ పనుల కారణంగా జూన్ 26 నుంచి 28వ తేదీ వరకు ఈ సేవలు అందుబాటులో ఉండవని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ స్పష్టం చేసింది. దాదాపు ఐదేళ్ల తర్వాత చేపడుతున్న ఈ కీలకమైన నిర్వహణ పనుల ద్వారా సర్వర్ల పనితీరును, భద్రతను మరింత మెరుగుపరచనున్నట్లు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. భవిష్యత్తులో ప్రజలకు మరింత వేగవంతమైన, సులభతరమైన సేవలు అందించడమే ఈ అప్‌గ్రేడేషన్ ప్రధాన లక్ష్యమని ఆయన వివరించారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఈ షట్‌డౌన్‌ను సెలవు దినాల్లో నిర్ణయించారు. జూన్ 26న మొహర్రం పబ్లిక్ హాలిడే, జూన్ 28 ఆదివారం కావడంతో కేవలం ఒకే ఒక పనిదినమైన జూన్ 27 (శనివారం) మాత్రమే సేవలపై ప్రభావం పడనుంది. ఇప్పటికే జూన్ 27వ తేదీ కోసం స్లాట్లు బుక్ చేసుకున్న వారికి, వాటిని జూన్ 25వ తేదీకి మార్చినట్లు అధికారులు వెల్లడించారు. ఈ మూడు రోజుల పాటు రిజిస్ట్రేషన్ శాఖ వెబ్‌సైట్, ఆన్‌లైన్ పోర్టల్స్‌లు పనిచేయవు. జూన్ 29వ తేదీ నుంచి సేవలు యథావిధిగా పునఃప్రారంభమవుతాయని, పౌరులు దీనికి అనుగుణంగా తమ పనులను ప్రణాళిక చేసుకోవాలని అధికారులు సూచించారు.

## ఖమ్మం ఎంపీ క్యాంప్ కార్యాలయంలో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

-ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు పోరాడుతున్న గొప్ప నేత అని కొనియాడిన ఎంపీ రఘురాం రెడ్డి పార్టీ శ్రేణుల నడుమ కేక్ కటింగ్

హిందుస్థాన్ మీడియా



ఖమ్మం: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదినోత్సవ వేడుకలను శుక్రవారం ఖమ్మంలోని గట్టయ్య సెంటర్ లో గల ఎంపీ క్యాంప్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి హాజరై.. కాంగ్రెస్ పార్టీ శ్రేణుల నడుమ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ రఘురాం రెడ్డి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు, సామాజిక న్యాయం అందించేందుకు రాహుల్ గాంధీ నిబద్ధతతో ముందుకు సాగుతున్నారని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రధానిగా చూడాలనేది ప్రజల ఆకాంక్ష అని, భవిష్యత్తులో ఇది సాకారం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు దీపక్ చౌదరి, సీనియర్ నాయకులు మిక్కిలినేని నరేంద్ర, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యడ్లపల్లి సంతోష్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, ప్రతిభా రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కొప్పుల చంద్రశేఖర్, టీపీసీ సభ్యులు ఉమ్మినేని కృష్ణ, ఇమామ్ భాయ్, నాయకులు కిరణ్ నాయక్, మేడా వెంకట్రావ్, క్రాంతి, పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేరుకే 'మూర్తి'.. కానీ జగమంత ఆయన కీర్తి!




- అర్జునపట్ల స్కూల్ మూర్తి సార్‌కు పుట్టినరోజు వేడుకల శుభాకాంక్షలు
- గురువుపై అపారమైన భక్తిని చాటుకున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

చేర్యాల/అర్జునపట్ల (హిందూస్తాన్ మీడియా):

"ఈ లోకంలో కష్టానికి తగ్గ ఫలితాన్ని ఆశించే వారు కొందరైతే.. ఫలితం కోసం కష్టపడేవారు మరికొందరు. కానీ, ఫలితానికి మించిన కష్టాన్ని, నిస్వార్థమైన సేవను సమాజానికి అందించేవారు చాలా అరుదుగా ఉంటారు. అలాంటి అరుదైన, మహోన్నతమైన వ్యక్తులలో ఒకరే మా మూర్తి సార్" అంటూ అర్జునపట్ల ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ ప్రియతమ ఉపాధ్యాయుడిపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. జూన్ 20న మూర్తి సార్ జన్మదినాన్ని పురస్కరించుకుని పాఠశాల విద్యార్థులంతా కలిసి ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

**బడి పిల్లల భవిష్యత్తే ఆయన శ్వాస..**

ప్రభుత్వ బడి పిల్లల చదువు కోసం నిరంతరం తపిస్తూ, వారి జీవితాలు బాగుపడాలని కలలు కంటూ, ఎంతోమంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి వారి బంగారు భవిష్యత్తుకు మార్గదర్శిగా నిలిచిన వ్యక్తి మూర్తి సార్ అని విద్యార్థులు కొనియాడారు. విద్యార్థుల పట్ల ఆయన చూపే ఆదరణ, బోధనా శైలి ఎందరికో ఆదర్శంగా నిలిచాయన్నారు. మూర్తి సార్ జన్మదినం సందర్భంగా అర్జునపట్ల పాఠశాల విద్యార్థులు ఆయనకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలుపుతూ.. సార్ జీవితంలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ...

– ఇట్లు..

అర్జునపట్ల ఉన్నత పాఠశాల విద్యార్థులు మరియు ఉపాధ్యాయ బృందం.

# మూసీ రివర్ ఫ్రంట్ కు కేంద్రం అనుమతి ధన్యవాదాలు తెలిపిన రేవంత్ రెడ్డి

-రక్షణ శాఖ భూములు వినియోగించుకునేందుకు కేంద్రం అనుమతి

-83.81 ఎకరాల డిఫెన్స్ భూమి వినియోగించుకోవడానికి క్లియరెన్స్ ఇచ్చిన కేంద్రం

-వేగవంతం కానున్న మూసీ ఫేజ్-1 పనులు

హిందుస్థాన్ మీడియా



తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధి, పునరుజ్జీవన ప్రాజెక్టులో ఒక కీలక ముందడుగు పడింది. హైదరాబాద్‌లోని బాపూఘాట్‌ను 'గాంధీ సరోవర్' ప్రాజెక్టుగా అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేసేందుకు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ అధికారికంగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టు పరిధిలోకి వచ్చే రక్షణ శాఖ భూములను వినియోగించుకునేందుకు వీలుగా కేంద్రం పని అనుమతులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ అనుమతుల ప్రకారం... ఆర్టిలరీ సెంటర్ గోల్కొండ పరిధిలోని సుమారు రూ. 533.42 కోట్ల విలువైన 83.81 ఎకరాల రక్షణ శాఖ భూమిని గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ అభివృద్ధి పనుల కోసం వినియోగించుకోవడానికి కేంద్రం క్లియరెన్స్ ఇచ్చింది. లీగల్, డిఫెన్స్ నిబంధనల ప్రకారం ఇరు ప్రభుత్వాల మధ్య జరిగిన సుదీర్ఘ సంప్రదింపుల అనంతరం ఈ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్ ప్రక్రియకు కేంద్ర రక్షణ శాఖ తుది ఆమోదం తెలిపింది. దీంతో బాపూఘాట్ పరిసరాల్లో ప్రతిపాదిత అంతర్జాతీయ స్థాయి స్మారక చిహ్నాలు, పర్యాటక హంగుల నిర్మాణానికి ఉన్న ప్రధాన లీగల్ అడ్డంకులు తొలగిపోయాయి. మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టుకు కేంద్రం నుంచి అనుమతులు లభించడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టుకు సహకరించిన రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. "మూసీ పునరుజ్జీవం, రివర్ ఫ్రంట్ అభివృద్ధికి సంబంధించి మా ప్రభుత్వం పెట్టుకున్న సుదూర లక్ష్యాలు సాధించడంలో ఇదో చారిత్రాత్మక మైలురాయి. మూసీ పరివాహక ప్రాంతాన్ని కేవలం కాంక్రీట్ కట్టడాలుగా కాకుండా.. పర్యావరణ, సాంస్కృతిక, అద్భుతమైన ప్రజా ఆస్తిగా మార్చడమే మా ప్రభుత్వ ప్రధాన సంకల్పం" అని సీఎం స్పష్టం చేశారు. కేంద్రం ఇచ్చిన క్లియరెన్స్‌తో మూసీ ఫేజ్-1 పనులు మరింత వేగవంతం కానున్నాయి.

# రాహుల్ పీఎం, రేవంత్ మరోసారి సీఎం కావడం ఖాయం: కడియం శ్రీహరి

హిందుస్థాన్ మీడియా



కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు తెలంగాణ వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలో జరిగిన బర్త్‌డే సెలబ్రేషన్స్‌లో స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొన్నారు. పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి భారీ కేక్ కట్ చేసిన కడియం.. దేశ, రాష్ట్ర రాజకీయాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాబోయే రోజుల్లో దేశానికి రాహుల్ గాంధీ పీఎం కావడం, ఇటు తెలంగాణలో రేవంత్ రెడ్డి మరోసారి సీఎం కావడం వంద శాతం పక్కా అని కడియం శ్రీహరి ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలంతా రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. "తెలంగాణలో మాకు ఇక ఎదురే లేదు, తిరుగే లేదు అన్నట్లు అహంకారంతో వ్యవహరించిన కేసీఆర్‌కు రాష్ట్ర ప్రజలు ఎలాంటి గుణపాఠం చెప్పారో మనమంతా చూశాం. రానున్న రోజుల్లో కేంద్రంలోని బీజేపీ, మోదీ ప్రభుత్వానికి కూడా దేశ ప్రజలు అదే రీతిలో బుద్ధి చెప్పడం ఖాయం" అని అన్నారు. దేశంలో బీజేపీ అనుసరిస్తున్న ప్రజాస్వామ్య, రాజ్యాంగ వ్యతిరేక విధానాలను రాహుల్ గాంధీ ఒంటరిగా ఎండగడుతున్నారని కొనియాడారు. అంబేద్కర్ స్ఫూర్తితో దేశ రాజ్యాంగాన్ని కాపాడేందుకు, అణగారిన వర్గాల బాధితులకు అండగా ఉంటూ పార్లమెంట్‌లో రాహుల్ గళం విప్పుతున్నారని ప్రశంసించారు.

# మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన వైద్యశాస్త్రంలో రక్తానికి ప్రత్యామ్నాయం లేదు చేర్యాల సీఐ బానోతు రమేష్ నాయక్ మాజీ ఎంపీపీ డా. రామగల్ల పరమేశ్వర్

చేర్యాల (హిందుస్థాన్ మీడియా):
రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని, వైద్యశాస్త్రంలో రక్తానికి ఇప్పటికీ ప్రత్యామ్నాయం లేదని చేర్యాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బానోతు రమేష్ నాయక్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ మలక్‌పేట బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో చేర్యాల పట్టణంలోని అక్షయ ఆసుపత్రిలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరాన్ని చేర్యాల సీఐ బానోతు రమేష్ నాయక్, మాజీ ఎంపీపీ డాక్టర్ రామగల్ల పరమేశ్వర్ సంయుక్తంగా ప్రారంభించారు. శిబిరంలో సుమారు 100 మంది రక్తదాతలు పాల్గొని రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారందరికీ నిర్వాహకులు ప్రత్యేక అభినందనలు తెలియజేసి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీఐ రమేష్ నాయక్ మాట్లాడుతూ ప్రతి ఆరోగ్యవంతమైన వ్యక్తి సంవత్సరానికి కనీసం రెండుసార్లు రక్తదానం చేయాలని సూచించారు. రక్తదానం చేయడం వల్ల కొత్త రక్తకణాలు ఉత్పత్తి అవుతాయని, అదే సమయంలో అవసరమైన వారికి ప్రాణదానంగా మారుతుందని పేర్కొన్నారు. మాజీ ఎంపీపీ డాక్టర్



రామగల్ల పరమేశ్వర్ మాట్లాడుతూ అన్ని దానాల కంటే రక్తదానం, అవయవదానం అత్యంత శ్రేష్ఠమైనవని అన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన పెంపొందించుకుని ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 45 సార్లు రక్తదానం చేసిన సీపీఐ మండల సహాయ కార్యదర్శి కత్తుల భాస్కర్ రెడ్డిని సీఐ రమేష్ నాయక్ శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అపూర్వ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పుర్మ ఆగంరెడ్డి, కొమురవెల్లి దేవస్థాన మాజీ చైర్మన్ ఆడెపు చంద్రయ్య, సర్పంచులు జానకి కృష్ణ, లీల స్వామి, దాసరి పరశురాములు, కౌన్సిలర్లు వీరబత్తిని సదానందం, కమలపురం గీతాంజలి రమేష్, పోతుగంటి ప్రసాద్ గౌడ్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్, మాజీ వైస్ చైర్మన్



పుర్మ వెంకట్ రెడ్డి, బీజేపీ జిల్లా నాయకుడు ముచ్చంతుల సిద్ధారెడ్డి, తడక లింగమూర్తి, పాల లక్ష్మీనారాయణ, బండారి కనకయ్య, బుట్టి సత్యనారాయణ, భూమిగారి రాజేందర్, బుట్టి బిక్షపతి, ఈరి భూమయ్య, నంగి కనకయ్య, ఉప్పల రాములు, బండారి అంజయ్య, అంబాల రాము, ఎండి జహురుద్దీన్, బస్వరాజు యాదగిరి, బస్వగళ్ల రమేష్, కల్వకోట రవీందర్ రావు, భూమిగారి దామోదర్, మల్లిగారి నరసింహులు, అవుషర్ల కిషోర్, తడక లక్ష్మణ్, అవుషర్ల వెంకటేష్, గదరాజు ప్రసాద్, రామగల్ల నాగరాజు, డాక్టర్ రామగల్ల భూవన్ చతుర్వేది, హైదరాబాద్ బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు డాక్టర్ శివరాం ప్రసాద్, కోయుర్ జయదాస్, పిన్న రమేష్, నిఖిల్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# నర్సాయపల్లిలో ఘనంగా 'డ్రై డే'.. పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక నిఘా!

-కలెక్టర్ ఆదేశాలతో రంగంలోకి దిగిన గ్రామ పంచాయతీ పాలకవర్గం
-నీరు నిల్వ ఉంచితే దోమలు పెరిగి డెంగ్యూ, మలేరియా ముప్పు: సర్పంచ్ శనిగరం సత్యనారాయణ

మద్దూరు/నర్సాయపల్లి (హిందూస్తాన్ మీడియా):
వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తగా సిద్దిపేట జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మద్దూరు మండలం నర్సాయపల్లి గ్రామ పంచాయతీలో శుక్రవారం 'డ్రై డే' (Dry Day) కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించారు. మద్దూరు మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు, నర్సాయపల్లి గ్రామ సర్పంచ్ శనిగరం సత్యనారాయణ ఆధ్వర్యంలో వార్డు సభ్యులు, ఆశా కార్యకర్తలు, పంచాయతీ సిబ్బందితో కలిసి ఊరిలోని ప్రతి వీధిని, ఇంటి పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు.

-నిల్వ నీటితోనే రోగాల ముప్పు..
ఈ సందర్భంగా సర్పంచ్ శనిగరం సత్యనారాయణ గ్రామ ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ పలు కీలక సూచనలు చేశారు: దోమల నివారణ: ఇళ్ల పరిసరాల్లో పాతబడిన ప్లాస్టిక్ డబ్బాలు, విరిగిపోయిన కుండలు, పాత టైర్లు, రంజన్లు, డ్రమ్ములలో నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. నిల్వ నీటిలోనే డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వ్యాధులను వ్యాప్తి చేసే దోమలు గుడ్లు పెట్టి పెరుగుతాయన్నారు. పరిసరాల శుభ్రత: వారానికి ఒకరోజు కచ్చితంగా నీటి నిల్వలను ఖాళీ చేసి ఎండబెట్టడం ద్వారా దోమల బెడదను పూర్తిగా తగ్గించవచ్చని వివరించారు.

-ఆహార నియమాలు తప్పనిసరి:
దోమలతో పాటు వర్షాకాలంలో ఈగలు ఎక్కువగా వాలుతుంటాయని, కాబట్టి పాచిపోయిన, నిల్వ ఉంచిన, ఈగలు వాలిన ఆహార పదార్థాలను ఎట్టి పరిస్థితుల్లోనూ తినవద్దని సర్పంచ్ హెచ్చరించారు.



కలుషిత ఆహారం, అపరిశుభ్ర నీటి వల్ల టైఫాయిడ్, డయేరియా (విరేచనాలు), గ్యాస్ట్రో ఎంటరైటిస్ వంటి ప్రాణాంతక వ్యాధులు వస్తాయని, ప్రజలంతా వేడి వేడి ఆహారాన్ని, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నర్సాయపల్లి ఉపసర్పంచ్ మంతెన భరత్ రెడ్డి, వార్డు సభ్యులు చింతల కావేరి-సాయి, రాగుల బాలనర్సయ్య, చల్ల సంతోష్ రెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి భాస్కర్, ఆశా కార్యకర్తలు రజిత, రేణుక, మరియు గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ?గాగిల్లాపూర్‌లో ముమ్మరంగా 'ఫ్రైడే-డ్రై డే'.. పిచ్చి మొక్కలు, మురికినీరు తొలగింపు!

-అంబేద్కర్ కూడలి నుండి బస్టాండ్ వరకు రోడ్లు శుభ్రం చేసిన పంచాయతీ సిబ్బంది
-ఇంటి పరిసరాల్లో మురికినీరు నిల్వ ఉంచొద్దు: సర్పంచ్ ఇట్టబోయిన కనకచంద్రం పిలుపు

మద్దూరు/గాగిల్లాపూర్ (హిందూస్తాన్ మీడియా):
వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా చూసేందుకు సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం గాగిల్లాపూర్ గ్రామ పంచాయతీలో శుక్రవారం 'ఫ్రైడే-డ్రై డే' (Friday Dry Day) కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. గాగిల్లాపూర్ గ్రామ సర్పంచ్ ఇట్టబోయిన కనకచంద్రం స్వయంగా రంగంలోకి దిగి వార్డు సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, ఐకేపీ వెలుగు సిబ్బంది మరియు పంచాయతీ కార్మికులతో కలిసి ఈ పారిశుధ్య డ్రైవ్‌ను చేపట్టారు.

-రహదారుల క్లీనింగ్.. పిచ్చి మొక్కల తొలగింపు!
ఈ పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ సిబ్బంది ఊరిలోని ప్రధాన రహదారుల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించారు. గాగిల్లాపూర్ అంభేద్కర్ కూడలి నుండి స్థానిక బస్టాండ్ వరకు ఉన్న రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని ఊడ్చి వేయడమే కాకుండా.. దోమలు, కీటకాలకు నివాసాలుగా మారిన పిచ్చి మొక్కలను, ముళ్లపొదలను జేసీబీ మరియు కార్మికుల సహాయంతో పూర్తిగా తొలగించి రోడ్లను సుందరంగా మార్చారు.

-మురికినీటిపై ప్రజలకు సర్పంచ్ హెచ్చరిక..
ఈ సందర్భంగా సర్పంచ్ ఇట్టబోయిన కనకచంద్రం వీధుల గుండా తిరుగుతూ ఇంటి పరిసరాలను స్వయంగా పరిశీలించారు. అనంతరం ఆయన గ్రామ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ.. వానాకాలం ముంచుకొస్తున్న తరుణంలో ప్రజలంతా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని కోరారు. ఇళ్ల ముందర మరియు డ్రైనేజీ కాలువల వద్ద మురికినీరు అస్సలు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. మురికినీటి వల్ల దోమలు విపరీతంగా పెరిగి డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి ప్రాణాంతక జ్వరాలు వచ్చే ప్రమాదం ఉందని



హెచ్చరించారు. ప్రతి శుక్రవారం తమ ఇళ్లలోని కూలర్లు, డ్రమ్ములు, కుండలను ఖాళీ చేసి 'డ్రై డే' పాటించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గాగిల్లాపూర్ ఉపసర్పంచ్ గొడుగు బాలరాజు, గ్రామ పంచాయతీ కార్యదర్శి రజియా, ఐకేపీ వెలుగు సీఏ బొంకూరి బాలమణి, అంగన్‌వాడీ టీచర్ దాసరి కళావతి పాల్గొన్నారు. ?అలాగే వార్డు సభ్యులు మరియు ముఖ్య నేతలు బసవరాజ్ స్వామి, ఏలూరు శివ, అతుకూరి పద్మ, సలాది కళావతి, యామ కవిత, మేక కనకయ్య, ఏలూరు పరశురాములు మరియు గ్రామ పంచాయతీ పారిశుధ్య సిబ్బంది, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# చుంచనకోట బడిలో ఘనంగా 'అక్షరాభ్యాసం'

-కార్పొరేట్ బడులకు దీటుగా ప్రభుత్వ బడుల్లో సౌకర్యాలు: సర్పంచ్ శ్రీనివాస్, కాంప్లెక్స్ హెచ్ఎం సురేష్ కుమార్

-చేర్యాల/చుంచనకోట (హిందూస్తాన్ మీడియా):
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'బడిబాట' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చుంచనకోట గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నూతన అడ్మిషన్లతో కళకళలాడింది. పాఠశాలలో కొత్తగా చేరుతున్న చిన్నారులకు గ్రామ ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు మరియు తల్లిదండ్రుల సమక్షంలో అత్యంత ఘనంగా, సాంప్రదాయబద్ధంగా "అక్షరాభ్యాస" కార్యక్రమాన్ని నిర్వహించారు.

-చిన్నారుల చేత ఓనమాలు..
గ్రామ సర్పంచ్ శ్రీనివాస్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సురేష్ కుమార్ కలిసి చిన్నారులకు స్లేట్లు (పలకలు), బలపాలు అందించి, వారి చేత తొలి అక్షరాలను దిద్దించి అక్షరాల ప్రపంచంలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. నిరుపేద, సామాన్య కుటుంబాల పిల్లలకు నాణ్యమైన మరియు ఉచిత విద్యను అందించడమే ప్రభుత్వ




పాఠశాలల ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు వేల రూపాయల ఫీజులు కట్టి మోసపోవద్దని, అన్ని వసతులు ఉన్న ప్రభుత్వ బడుల్లోనే పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు.

-సమిష్టి కృషితోనే 'బడిబాట' సక్సెస్..
కాంప్లెక్స్ హెచ్ఎం సురేష్ కుమార్ మరియు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో పాటు డిజిటల్ బోధన, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మరియు పోషకాలతో కూడిన మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తున్నట్లు వివరించారు. ఉపాధ్యాయులు, గ్రామ పాలకవర్గం సమిష్టిగా ఇంటింటికీ తిరిగి బడిబాటను విజయవంతం చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమం లో గ్రామ ఉపసర్పంచ్ ఆగయ్య, ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జ్ ఉపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, నాయకులు వెంకటేష్, మల్లికార్జున్, శారద పాల్గొన్నారు. వీరితో పాటు పాఠశాల ఉపాధ్యాయ బృందం, అంగన్‌వాడీ కార్యకర్తలు, మరియు నూతన విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ అక్షరాభ్యాస వేడుకను జయప్రదం చేశారు.

# కమిటీలతో కాలయాపన వదు

-ఉద్యమకారుల హామీలు వెంటనే అమలు చేయాలి
-తెలంగాణ ఉద్యమకారుల డిమాండ్



చేర్యాల, హిందుస్థాన్ మీడియా:
తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారులు డిమాండ్ చేశారు. జనగామ నియోజకవర్గం చేర్యాల మండల కేంద్రంలో నిర్వహించిన తెలంగాణ ఉద్యమకారుల సమావేశంలో అధ్యక్షుడు అంబటి అంజయ్య, ప్రధాన కార్యదర్శి అందె అశోక్, ఉపాధ్యక్షుడు మరియు కాంగ్రెస్ మైనార్టీ నాయకుడు మహమ్మద్ జహీరుద్దీన్, బండోజు భాస్కర్ మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి వారికి తగిన న్యాయం చేయాలని కోరారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలలో ఉద్యమకారులకు సంబంధించిన హామీలను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమ కేసులకు సంబంధించి అన్ని పోలీస్ స్టేషన్లలో ఎఫ్ఐఆర్‌లు, రికార్డులు అందుబాటులో ఉన్నాయని, వాటిని సేకరించి ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణతో ముందుకు రావాలని కోరారు. ఈ సమావేశంలో 1969 తెలంగాణ ఉద్యమకారులు అంబటి నరసయ్య, ఉపేందర్ రావు, చంద్రయ్య, నర్ర నరసయ్య, తేరాల రాజు ప్రసాద్, ఆడెపు సంతోష్, గూడెం అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎల్-నినో' ముప్పు: వ్యవసాయంలో రైతులకు ముందస్తు ప్రణాళిక తప్పనిసరి!

-తక్కువ వర్షపాతం నమోదయ్యే ఛాన్స్.. తొలకరి వర్షాలకే విత్తనాలు వేయొద్దు
-రైతులకు అవగాహన కల్పించిన మండల వ్యవసాయ అధికారి బూరెల రామకృష్ణ, సర్పంచ్ కనకమ్మ

మద్దూరు/ధర్మారం (హిందూస్తాన్ మీడియా):
ప్రస్తుత వానాకాలం సీజన్‌లో 'ఎల్-నినో' (EL-NINO) ప్రభావం వల్ల సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున, రైతులు వ్యవసాయంలో ముందస్తు ప్రణాళికలతో ముందుకు సాగాలని మద్దూరు మండల వ్యవసాయ అధికారి (AO) బూరెల రామకృష్ణ పిలుపునిచ్చారు. మద్దూరు మండలం ధర్మారం గ్రామంలో గ్రామ సర్పంచ్ జక్కుల కనకమ్మ లింగయ్య ఆధ్వర్యంలో రైతులకు సాగు పద్ధతులపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.



-60 నుండి 70 మిల్లీమీటర్ల వర్షం పడితేనే విత్తనాలు వేయాలి..
ఈ సందర్భంగా ఏఓ బూరెల రామకృష్ణ మాట్లాడుతూ.. ఎల్-నినో ప్రభావం వల్ల వర్షాలు ఆశించిన స్థాయిలో పడకపోవచ్చని, కాబట్టి రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ తొందరపడి ముందస్తు విత్తనాలు విత్తవద్దని హితవు పలికారు. కేవలం తొలి తొలకరి చినుకులకు భూమి పచ్చిగా అనిపించినంత మాత్రాన విత్తనాలు వేస్తే భూమిలో తేమశాతం తక్కువగా ఉండి అవి మొలకెత్తవన్నారు. భూమిలో తగినంత పదును రావాలంటే కనీసం 60 నుండి 70 ఎఎ (మిల్లీమీటర్ల) వర్షపాతం నమోదైన తర్వాతే విత్తనాలు విత్తుకోవాలని శాస్త్రీయంగా సూచించారు.

-సన్న వరి రకాల సాగుకే ప్రాధాన్యత ఇవ్వండి:
ఈ వానాకాలంలో తక్కువ నీటితో, తక్కువ కాల వ్యవధిలో పండే సన్న వరి ధాన్య రకాలను అధికంగా సాగు చేయాలని వ్యవసాయ అధికారి రైతులకు సిఫార్సు చేశారు. అందుకోసం కింది రకాలను ఎంచుకోవాలని సూచించారు:
?BPT-5204 (సాంబ మసూరి) తెలంగాణ సోనా KNM-1638, జైశ్రీరామ్ HMT, WGL-962, WGL-44 JGL-178

-ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలి..
వర్షభావ పరిస్థితులను తట్టుకుని, తక్కువ నీటి లభ్యతతోనే మంచి దిగుబడులు సాధించేందుకు రైతులు సాంప్రదాయ పంటలతో పాటు ఆరుతడి పంటల సాగు వైపు దృష్టి సారించాలని కోరారు. ముఖ్యంగా కందులు, పెసలు, మినుములు, మొక్కజొన్న మరియు సజ్జలు వంటి పంటలు వేసుకోవడం ద్వారా ఎల్-నినో ముప్పు నుండి ఆర్థికంగా నష్టపోకుండా రక్షణ పొందవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జక్కుల కనకమ్మ లింగయ్య, వ్యవసాయ విస్తరణ అధికారి (AEO) రాజు, స్థానిక రైతులు జక్కుల రమేష్, శ్రీనివాస్ రెడ్డి, ఆంజనేయులు, లక్ష్మణ్, రవీందర్ రెడ్డి మరియు ధర్మారం గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా కొమురవెల్లిలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

హిందుస్థాన్ మీడియా కొమురవెల్లి:
లోక్‌సభ ప్రధాన ప్రతిపక్ష నేత, ఏఐసీసీ అగ్రనేత శ్రీ రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని కొమురవెల్లి లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహాదేవుని శ్రీనివాస్ కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్ ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహదేవుని శ్రీనివాస్ మాట్లాడుతూ దేశ యువతకు ఉపాధి, అవకాశాల కల్పనే రాహుల్ గాంధీ ప్రధాన లక్ష్యమని అన్నారు. యువతే దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే శక్తి అని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ దేశంలోని నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న నాయకుడని ఆయన అన్నారు. ఉద్యోగ నియామక పరీక్షలలో తరచూ జరుగుతున్న పేపర్ లీకేజీల కారణంగా లక్షలాది మంది యువత తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. "ఉద్యోగాలు రావాలంటే విధానాల్లో మార్పు రావాలి" అని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ ఆకాంక్షించిన విధంగా సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, యువత సాధికారతకు ప్రాధాన్యం ఇచ్చే భారతదేశ నిర్మాణం జరగాలని ఆకాంక్షించారు. భగవంతుని ఆశీర్వాదంతో రాహుల్ గాంధీ మరింత ప్రజాసేవ చేయాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. బీజేపీ ప్రభుత్వం కొద్దిమంది పెత్తందారులను ప్రోత్సహించే విధానాలను అవలంబిస్తోందని విమర్శించిన మహదేవుని శ్రీనివాస్, సాధారణ ప్రజలు, రైతులు, యువత ప్రయోజనాల కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీకి దీర్ఘాయుష్షు, సంపూర్ణ ఆరోగ్యం కలగాలని కోరుతూ పార్టీ శ్రేణులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామ సర్పంచ్ లు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, మండల ఆత్మ కమిటీ, కిసాన్ సెల్, బీసీ సెల్, ఎస్సీ సెల్ నాయకులు, యూత్ కాంగ్రెస్, మహిళా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



## చేర్యాలలో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు!

-కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ కేక్ కటింగ్, స్వీట్ల పంపిణీ

-పాల్గొన్న బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మంజే మల్లేశం, మండల, పట్టణ అధ్యక్షులు



చేర్యాల (హిందూస్తాన్ మీడియా): కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను శుక్రవారం చేర్యాల పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. కాంగ్రెస్ శ్రేణులు, ముఖ్య నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి రాహుల్ గాంధీ జన్మదిన సంబరాలను జరుపుకున్నారు.

-జై రాహుల్ గాంధీ నినాదాలతో హోరెత్తిన చేర్యాల..

ఈ వేడుకల్లో భాగంగా చేర్యాల పట్టణంలో కాంగ్రెస్ నాయకులు భారీ కేక్‌ను కట్ చేశారు. అనంతరం ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ, స్వీట్లు పంపిణీ చేస్తూ రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. రాహుల్ గాంధీ భవిష్యత్తులో దేశానికి ప్రధానమంత్రి కావాలని, ఆయన నాయకత్వంలో దేశం మరింత ప్రగతి పథంలో ముందుకు సాగాలని ఈ సందర్భంగా నాయకులు ఆకాంక్షించారు. 'జై కాంగ్రెస్.. జై జై రాహుల్ గాంధీ' అంటూ కార్యకర్తలు చేసిన నినాదాలతో పట్టణ కేంద్రం హోరెత్తింది. ఈ జన్మదిన వేడుకల్లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మంజే మల్లేశం, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కొమ్ము రవి, పట్టణాధ్యక్షుడు దాసరి శ్రీకాంత్ ప్రధాన పాత్ర పోషించారు. వీరితో పాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు, వివిధ అనుబంధ సంఘాల ప్రతినిధులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థులు లక్ష్యాలను అందుకోవడానికి మా శక్తికి మించి తీర్చిదిద్దుతాం!

-ఆకునూరు జెడ్పీహెచ్ఎస్ (ZPHS)లో 6వ తరగతి నూతన విద్యార్థులకు ఘన స్వాగతం

-సొంత బిడ్డల్లా చూసుకుంటూ విద్యాబోధన: ప్రధానోపాధ్యాయులు శనిగరం వీరస్వామి భరోసా



చేర్యాల/ఆకునూరు (హిందూస్తాన్ మీడియా): ఆకునూరు గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి పూర్తి చేసుకుని, అదే గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (ZPHS)లో 6వ తరగతిలోకి అడుగుపెట్టిన నూతన విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయ బృందం ఘనంగా స్వాగత కార్యక్రమం నిర్వహించింది. 'బడిబాట' నూతన అడ్మిషన్ల ఉత్సాహంలో భాగంగా పాఠశాలకు వచ్చిన చిన్నారులకు ఉపాధ్యాయులు సాదరంగా ఓనమాల ప్రపంచంలోకి ఆహ్వానం పలికారు.

-కార్పొరేట్ బదులకు దీటుగా వసతులు..

ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శనిగరం వీరస్వామి మాట్లాడుతూ.. ఆకునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల విద్యా వికాసానికి కావలసిన అన్ని రకాల మౌలిక వసతులు, సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. పాఠశాలలో ఉన్న అద్భుతమైన, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయ బృందం విద్యార్థులను తమ సొంత బిడ్డల్లా చూసుకుంటూ నాణ్యమైన విద్యను అందిస్తున్నారని కొనియాడారు.

-ఉన్నత శిఖరాలకు ఆకునూరు విద్యార్థులు:

గతంలో ఈ పాఠశాలలో చదువుకున్న ఎంతోమంది విద్యార్థులు నేడు సమాజంలో ఉన్నత శిఖరాలను అధిరోహించారని హెచ్ఎం వీరస్వామి గుర్తు చేశారు. ప్రస్తుత నూతన విద్యార్థులు కూడా భవిష్యత్తులో తాము అనుకున్న ఆశయాలను, లక్ష్యాలను విజయవంతంగా అందుకోవడానికి ఉపాధ్యాయులమంతా మా శక్తికి మించి శ్రమించి, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతామని తల్లిదండ్రులకు బలమైన భరోసా ఇచ్చారు. ఈ స్వాగత కార్యక్రమంలో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు బూరుగు సత్యనారాయణ, శైలజ, కవిత, గణేష్, కృష్ణమూర్తి, శ్రీశైలం, హరిప్రసాద్, నూతనంగా చేరిన విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## జనసేన తెలంగాణ రాష్ట్ర కార్యాలయ ప్రారంభోత్సవం-పార్టీ జెండా ఆవిష్కరించిన పవన్



హిందుస్థాన్ మీడియా

ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికలలో ఘనవిజయం సాధించి, కూటమి ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా మారిన జనసేన పార్టీ.. ఇప్పుడు పొరుగు రాష్ట్రమైన తెలంగాణపై తన రాజకీయ దృష్టిని కేంద్రీకరించింది. రాష్ట్రంలో పార్టీ విస్తరణ, సంస్థాగత బలోపేతమే లక్ష్యంగా సరికొత్త వ్యూహాలతో దూకుడు పెంచింది. ఇందులో భాగంగానే హైదరాబాద్‌లోని మణికొండ (మల్కం చెరువు సమీపంలో) నూతనంగా నిర్మించిన జనసేన తెలంగాణ రాష్ట్ర కార్యాలయం శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలతో అధికారికంగా ప్రారంభమైంది. జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయ ప్రారంభోత్సవం సందర్భంగా పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ జనసేన జెండాను ఆవిష్కరించి కార్యాలయంలోకి అడుగు పెట్టారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తెలంగాణ తల్లి చిత్రపటానికి నమస్కరించి, రాష్ట్ర నాయకులతో ముచ్చటించారు.

## వల్లంపట్లలో ముమ్మరంగా 'ఫ్రైడే - డ్రై డే'.. ఇంటింటికీ తిరిగి అవగాహన!







-సీజనల్ వ్యాధుల నివారణకు నడుం బిగించిన గ్రామ పంచాయతీ పాలకవర్గం

-డెంగ్యూ, మలేరియా రాకుండా మురికినీటి నిల్వలను తొలగించాలి: సర్పంచ్ కర్నే సునీత మనోహర్

మద్దూరు/వల్లంపట్ల (హిందూస్తాన్ మీడియా): వర్షాకాలం ఆరంభంలోనే దోమల వృద్ధిని అరికట్టి, పల్లెలను ఆరోగ్యవంతంగా ఉంచాలనే లక్ష్యంతో సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం వల్లంపట్ల గ్రామంలో శుక్రవారం 'ఫ్రైడే – డ్రై డే' (Friday - Dry Day) కార్యక్రమాన్ని అత్యంత ప్రణాళికాబద్ధంగా నిర్వహించారు. వల్లంపట్ల గ్రామ సర్పంచ్ కర్నే సునీత మనోహర్ స్వయంగా రంగంలోకి దిగి వార్డు ప్రతినిధులు, వైద్య ఆరోగ్య సిబ్బంది మరియు పంచాయతీ కార్యకర్తలతో కలిసి గ్రామంలోని ప్రతి వీధిలో పర్యటించారు.

-మురికినీరు నిల్వ ఉంటే డెంగ్యూ ముప్పు..

ఈ సందర్భంగా సర్పంచ్ కర్నే సునీత మనోహర్ గ్రామ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ.. వానాకాలంలో డెంగ్యూ, మలేరియా, గన్యా వంటి ప్రమాదకరమైన సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. వీటన్నింటికీ దోమలే ప్రధాన కారణమని, కాబట్టి ప్రతి ఒక్కరూ తమ ఇంటి చుట్టుపక్కల పరిసరాలను ఎల్లప్పుడూ పొడిగా ఉంచుకోవాలని సూచించారు. ఇళ్ల ముందర, రోడ్ల పక్కన ఎక్కడా మురికినీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, ఇంట్లోని ఎయిర్ కూలర్లు, పాత డ్రమ్ములు, పూల కుండీలలోని నీటిని వారానికి ఒకసారి పూర్తిగా పారబోసి శుభ్రం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

-ఇంటింటికీ తిరిగి వైద్య సిబ్బంది సర్వే..

ఈ కార్యక్రమంలో భాగంగా పంచాయతీ కార్యదర్శి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు బృందాలుగా ఏర్పడి వల్లంపట్లలోని ఇంటింటినీ సందర్శించి,నిల్వ ఉన్న పాత నీటి వనరులను ఖాళీ చేయించడంతో పాటు, జ్వరాల బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో మహిళలకు, గ్రామ ప్రజలకు ప్రత్యక్షంగా వివరించి అవగాహన కల్పించారు. ఈ ?కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ మాచర్ల రఘు ముదిరాజ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి కిరణ్ కుమార్ పాల్గొన్నారు. వీరితో పాటు ఐకేపీ వెలుగు సంఘాల సీఏలు , ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, మరియు గ్రామ పంచాయతీ పారిశుధ్య సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## సిద్దిపేటలో హరీష్ రావును ఓడించడం ఎవరి వల్లా కాదు!

-ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై మండిపడ్డ బీఆర్ఎస్ చిన్నకోడూరు నేతలు

-ధాన్యం కొనుగోళ్లలో కాంగ్రెస్ సర్కార్ విఫలం.. రైతుబంధు నిధులను వెంటనే విడుదల చేయాలి

చిన్నకోడూరు (హిందూస్తాన్ మీడియా): సిద్దిపేట ప్రజల ఆరాధ్య నాయకుడు, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావుని ఓడించడం ఎవరి వల్లా సాధ్యం కాదని బీఆర్ఎస్ పార్టీ చిన్నకోడూరు మాజీ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్ స్పష్టం చేశారు. శుక్రవారం చిన్నకోడూరు మండల కేంద్రంలో బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన పదవిపై ఉన్న అనిశ్చితి, భయాందోళనల కారణంగానే సిద్దిపేటలో హరీష్ రావు గారి ఓటమిపై అనాలోచిత వ్యాఖ్యలు చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. హరీష్ రావు గారిపై సిద్దిపేట నియోజకవర్గ ప్రజలకు ఉన్న అభిమానం వెలకట్టలేనిదని, ఆయన ఓటమి గురించి మాట్లాడటం పగటికలలే అవుతాయన్నారు.

-ధాన్యం కొనుగోళ్లలో కాంగ్రెస్ చేతులెత్తేసింది..

రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కాముని శ్రీనివాస్ ఆరోపించారు. రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేయలేక ఈ ప్రభుత్వం చేతులెత్తేసిందని మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేసి అండగా నిలిచారని, ఆ విషయాన్ని రైతాంగం ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా రైతులను ఆదుకున్న ఘనత కేసీఆర్‌దేనని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన బోనస్ హామీలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని విమర్శించారు.

-రైతాంగ సమస్యలపై బీఆర్ఎస్ డిమాండ్లు:

ఈ సందర్భంగా చిన్నకోడూరు బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వం ముందు కింది డిమాండ్లను ఉంచారు: రైతుబంధు విడుదల: రైతులకు పెండింగ్‌లో ఉన్న పాత రైతుబంధు నిధులతో పాటు, ప్రస్తుత విడత సాయాన్ని తక్షణమే రైతుల ఖాతాల్లో జమ చేయాలి. రైతు బీమా: రైతు బీమా పథకాన్ని ఎలాంటి ఆటంకాలు లేకుండా సమర్థవంతంగా అమలు చేయాలి. స్పష్టమైన హామీ: రాబోయే వానాకాలం పంటల కొనుగోలుపై ప్రభుత్వం ఇప్పటి నుండే రైతులకు స్పష్టమైన భరోసా ఇవ్వాలి.

-యూరియా దందా బంద్:



యూరియా ఎరువులను వివిధ రకాల యాప్‌ల ద్వారా కాకుండా, పాత పద్ధతిలోనే నేరుగా ఎరువుల దుకాణాల ద్వారా రైతులకు అందుబాటులో ఉంచాలి. ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై రాబోయే రోజుల్లో ప్రజలు కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతారని, క్షేత్రస్థాయిలో బీఆర్ఎస్ పార్టీ మరింత బలంగా ముందుకు సాగుతుందని నాయకులు హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, మాజీ వైస్ ఎంపీపీ కీసరి పాపయ్య, సర్పంచ్‌ల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు కాముని ఉమేష్ చంద్ర, ముఖ్య నాయకులు రేగుల దేవయ్య, నముండ్ల హరీష్, మన్నె ఆనంద్, పిట్ల ప్రేమ్, రాజశేఖర్ రెడ్డి, భాను, ఏదుల రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ధూళిమిట్ట, మద్దూరు మండలాల్లో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు!



ధూల్మిట్ట



కొడవటూర్ సిద్దేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



మద్దూర్ లో

-సిద్దేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు.. రాహుల్ గాంధీ దేశ ప్రధాని కావాలని ఆకాంక్ష

-జనగాం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కొమ్మూరు ప్రతాపరెడ్డి ఆదేశాలతో కాంగ్రెస్ శ్రేణుల కేక్ కటింగ్, స్వీట్ల పంపిణీ

ధూళిమిట్ట/మద్దూరు (హిందూస్తాన్ మీడియా): కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను శుక్రవారం ధూళిమిట్ట, మద్దూరు మండల కేంద్రాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అత్యంత వైభవంగా నిర్వహించారు. జనగాం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కొమ్మూరు ప్రతా పరెడ్డి ఆదేశాల మేరకు ఆయా మండలాల అధ్యక్షుల ఆధ్వర్యంలో కేక్ కటింగ్స్, స్వీట్ల పంపిణీ మరియు ప్రత్యేక పూజా కార్యక్రమాలతో నియోజ కవర్గవ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొంది.

-ధూళిమిట్ట మండల కేంద్రంలో వేడుకలు:

ధూళిమిట్ట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోల సాయిలు ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వీట్లు తినిపించుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో నర్సాయపల్లి సర్పంచ్ లీలా జగన్మోహన్ రెడ్డి, ఉపసర్పంచ్ తుశాలపురం రాజు, మైనార్టీ సెల్ అధ్యక్షులు మొహమ్మద్ రఫీ, మండల ఉపాధ్యక్షులు నాయుల బుచ్చిరెడ్డి, దుబ్బ తండా సర్పంచ్ ఫాల్తే రమేష్, కొమురవెల్లి మాజీ డైరెక్టర్ పాల్తే శ్రీనివాస్, తోర్నాల ఉపసర్పంచ్ రాజు, మాజీ సర్పంచ్ సుద్దాల రేణుక నరసింహులు, ధూళిమిట్ట యూత్ అధ్యక్షుడు తుశాలపురం బాబు, సీనియర్ నాయకులు చెనోజు బ్రహ్మం, పరిధి కనక రాములు, గోనేపల్లి స్వామి, యాదయ్య, ఉపేందర్, మరియు స్థానిక రైతులు, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

-సిద్దేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు:

రాహుల్ గాంధీ భవిష్యత్తులో దేశానికి ప్రధానమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ మద్దూరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ కొడవటూరు సిద్దేశ్వర స్వామి దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. దేశ ప్రజల కొరకు నిరంతరం తపించే రాహుల్ గాంధీకి దేశ రాజకీయాల్లో అత్యున్నత స్థానం లభించేలా భగవంతుడి ఆశీస్సులు ఉండాలని నాయకులు మనసారా కోరుకున్నారు.

-మద్దూరు మండల కేంద్రంలో కేక్ కటింగ్:

మద్దూరు మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మేక మల్లేశం ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ జన్మదినం పురస్కరించుకుని భారీ కేక్‌ను కట్ చేశారు. అనంతరం ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ జై కాంగ్రెస్, జై రాహుల్ గాంధీ అంటూ నినాదాలు చేశారు. ఈ సంబరాల్లో కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల స్థాయి ముఖ్య నాయకులు, నూతన సర్పంచులు, వార్డు సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు మరియు కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఎస్సీ స్టడీ సర్కిల్ ను అధునాతనంగా తీర్చిదిద్దాలి.

-కలెక్టర్ చిత్రా మిశ్రా.

(హిందూస్తాన్ మీడియా)

ఎస్సీ స్టడీ సర్కిల్ లో అన్ని సౌకర్యాలు కల్పించి అధునాతనంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ స్టడీ సర్కిల్ ను సందర్శించారు. గదులు కలియ తిరుగుతూ పరిసరాలు పరిశీలించారు. ప్రస్తుత వసతుల గురించి గురించి సోషల్ వెల్ఫేర్ ఇంచార్జి డిప్యూటీ డైరెక్టర్ తిరుపతిరావును తెలుసుకున్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. ప్రశాంత వాతావరణంలో వారు చదువుకునేలా రీడింగ్ రూమ్ సిద్ధం చేయాలన్నారు. తాగునీరు మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం వంటి అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. స్టోర్ రూమ్ లో ఉన్న వస్తువులను ఖాళీ చేయించాలని, వారంలోగా భవనానికి అవసరమైన మరమ్మత్తులు చేయించాలని టీజీ డబ్ల్యూ ఐడీఎస్ అధికారులను ఆదేశించారు. ఆన్ లైన్ పరీక్ష నిర్వహించేలా కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టడీ సర్కిల్ ఉద్యోగులు ఉన్నారు.



## బాలయ్య సినిమాలో కాజల్.. ఫస్ట్ లుక్ విడుదల



నందమూరి బాలకృష్ణ, మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో వస్తున్న క్రేజీ ప్రాజెక్ట్ '#NBK111' నుంచి ఒక అదిరిపోయే అప్‌డేట్ బయటకు వచ్చింది. ఈ సినిమాలో కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తోందని టీమ్ అఫీషియల్‌గా అనౌన్స్ చేసింది. అంతేకాదు, ఈరోజు కాజల్ బర్త్‌డే సందర్భంగా ఆమె ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఎప్పుడూ అల్ట్రా గ్లామరస్‌గా కనిపించే కాజల్.. ఈ పోస్టర్‌లో పక్కా డీసెంట్ అండ్ ఇంటెన్సివ్ లుక్‌లోకి మారిపోయింది. నీలిరంగు గళ్ళ చీర, కళ్లద్దాలు పెట్టుకుని, జుట్టు ముడివేసి ఒక పవర్‌ఫుల్ ప్రభుత్వ అధికారిణిలాగా లేదా ఒక సీరియస్ లాయర్ లాగా కనిపిస్తోంది. ఆమె వెనుక ఉన్న పాత రోజుల నాటి ఆఫీస్ సెటప్, టేబుల్‌పై ఉన్న ఫైళ్లు చూస్తుంటే.. బాలయ్య సినిమాలో కాజల్ క్యారెక్టర్‌కు చాలా వెయిట్ ఉందని అర్థమవుతోంది. గతంలో బాలయ్య–గోపీచంద్ మలినేని కాంబోలో వచ్చిన 'వీరసింహారెడ్డి' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ప్రభంజనం సృష్టించిందో మనకు తెలిసిందే. ఇప్పుడు అదే కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా కావడంతో అంచనాలు ఆకాశంలో ఉన్నాయి. ఈ భారీ యాక్షన్ డ్రామాను వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు ఎక్కడా రాజీ పడకుండా భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు.

# తొలిసారి అరబిక్ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం-
# విడుదలైన 'బాబ్' సౌండ్‌ట్రాక్

-'బాబ్' పేరుతో తెరకెక్కిన సైకలాజికల్ ఫాంటసీ–థ్రిల్లర్
-మొత్తం 10 పాటలతో విడుదలైన ఒరిజినల్ సౌండ్‌ట్రాక్
-అన్ని ప్రధాన స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లలో అందుబాటులో ఉన్న ఆల్బమ్
-ఇదొక అర్థవంతమైన ప్రయాణమని వ్యాఖ్యానించిన రెహమాన్

ఆస్కార్ విజేత, విశ్వవిఖ్యాత సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ తన సంగీత ప్రస్థానంలో మరో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించారు. ఆయన తొలిసారిగా ఒక అరబిక్ చిత్రానికి సంగీతం అందించారు. ప్రముఖ దర్శకురాలు నైలా అల్ ఖాజా రూపొంది ంచిన సైకలాజికల్ ఫాంటసీ–థ్రిల్లర్ 'బాబ్' కోసం రెహమాన్ స్వరపరిచిన ఒరిజినల్ సౌండ్‌ట్రాక్ శు క్రవారం విడుదలైంది. ఈ ఆల్బమ్‌లో మొత్తం 10 పాటలు ఉన్నాయి. రెహమాన్‌కు చెందిన కేఎమ్ మ్యూజిక్ లేబుల్‌పై విడుదలైన ఈ సౌండ్‌ట్రాక్‌ను డివో సంస్థ ప్రపంచవ్యాప్తంగా పంపిణీ చేస్తోంది. అన్ని ప్రధాన మ్యూజిక్ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లలో ఇది ప్రస్తుతం అందుబాటులో ఉంది. ఈ ప్రాజెక్ట్ గురించి రెహమాన్ మాట్లాడుతూ "బాబ్' చిత్రంలోని భావోద్వే గభరితమైన కథ, దర్శకురాలు నైలా సృష్టించిన విలక్షణమైన ప్రపంచం నన్ను ఎంతగానో ఆకట్టుకున్నాయి. సినిమాకు తగ్గట్టుగా ప్రామాణికమైన సంగీతాన్ని అందించేందుకు కొత్త శబ్దాలను అన్వేషించాను. అరబిక్ సినిమాల్లోకి ఇది నాకు ఒక అర్థవంతమైన అడుగు" అని వివరించారు. 'బాబ్' చిత్రంలో వాహిదా అనే యువతి, తన కవల సోదరి మరణం వెనుక ఉన్న నిజాన్ని కొన్ని పాత క్యాసెట్ టేపుల ద్వారా




కనుగొంటుంది. ఈ ఆసక్తికరమైన కథాంశంతో ఈ సినిమా తెరకెక్కింది. షైమా ఎల్ ఫదుల్ ప్రధాన పాత్ర పోషించారు. ఇప్పటికే హాలీవుడ్, ఆసియా, యూరప్ సినిమాలకు అద్భుతమైన సంగీతం అందించి ప్రపంచ ఖ్యాతి పొందిన రెహమాన్, ఇప్పుడు అరబిక్ చిత్రంతో తన కీర్తిని మరింత విస్తరించుకున్నారు.

# 'వంద దేవుళ్ళు' మూవీ రివ్యూ

'బిచ్చగాడు' చిత్రంతో తెలుగులో హీరోగా గుర్తింపు తెచ్చుకున్న తమిళ కథానాయకుడు విజయ్ ఆంటోని ఆ తరువాత పలు అనువాద చిత్రాలతో తెలుగు ప్రేక్షకులను పలకరించాడు. అయితే 'బిచ్చగాడు' స్థాయి విజయాన్ని మాత్రం అందుకోలేకపోయాడు. ఈ సారి 'బిచ్చగాడు' చిత్ర దర్శకుడు శశి దర్శకత్వంలో ఆయన నటించిన చిత్రం 'వంద దేవుళ్ళు'తో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. బిచ్చగాడు తరహాలోనే ఈ చిత్రం కూడా అమ్మ కథాంశంతో కావడం విశేషం. ఈ శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రంతో విజయ్ ఆంటోని విజయాన్ని అందుకున్నాడా? ఈ చిత్రంలోని అమ్మ సెంటిమెంట్ ఎంత వరకు వర్కవుట్ అయ్యింది అనేది రివ్యూలో తెలుసుకుందాం. భర్త మరణంతో ఒంటరి మహిళగా సమాజంలో బ్రతుకుతూ తన పిల్లలకు తనే సర్వం అయ్యి పిల్లలను చదివించి, వారిని ఉన్నతస్థానంలో చూడాలని, అందుకోసం కూలీ పని చేస్తూ పిల్లలను పెంచుతుంది వాసవి (శ్వాసిక). సమాజంలో ఒక ఒంటరి మహిళ అనుభవించే అవమానాలు, కష్టాలు అన్నీ ఎదుర్కొంటూ పిల్లలను పెద్ద చదువులు చదివిస్తుంది. అయితే ఊర్లో భర్త లేని మహిళను ఇరుగు పొరుగు వారు చూసే పద్ధతి, వారి అవమానపు మాటలు భరించలేక మళ్లీ పెళ్లి చేసుకుంటే ఈ సూటిపోటి మాటల నుంచి విముక్తి కలుగుతుందని భావిస్తుంది. తమ టీచర్ ద్వారా తల్లి పెళ్లి ఆలోచన గురించి తెలుసుకున్న పెళ్లి వయసుకు వచ్చిన వాసవి పెద్ద కొడుకు అమ్మ నిర్ణయంపై ఎంతో మండిపడతాడు. చిన్న కొడుకు కూడా మొదట్లో తల్లి నిర్ణయాన్ని తప్పుబడతాడు. అసలు కొడుకులిద్దరూ అమ్మ నిర్ణయాన్ని ఎందుకు స్వాగతించలేదు. ఆ తరువాత అదే కొడుకులు అమ్మకు పెళ్లి చేయడానికి ఎంత తపనపడతారు? ఇందుకోసం వారి ప్రాణాలు తెగించి ఊరి పెద్దలతో ఎందుకు ఫైట్ చేశారు? వాసవికి, ఏడుకొండలు( విజయ్ ఆంటోని)కి పెళ్లి జరిగిందా? అనేది మిగతా కథ భర్త చనిపోయిన తరువాత ఓ మహిళ అమ్మగా, ఒంటరిగా తన పిల్లలను ప్రయోజకులను చేయడానికి తను అంతా కోల్పోయి, తన జీవితాన్ని పణంగా పెట్టి పిల్లలను ప్రయోజకులను చేయడానికి అహర్నిశలు శ్రమిస్తుంటుంది. తనకు ఓ జీవితం ఉందనే విషయాన్ని మరిచిపోతుంది. ఇలాంటి




ఓ కథాంశంతో అమ్మ కూడా ఓ మనిషే. ఆమెకు మనసుంటుంది. అది తెలియక ఆమె జీవితాన్ని కూడా మనమే బతికేయకూడదు అనే ఓ పర్పస్‌ఫుల్ కథతో, అమ్మ సెంటిమెంట్‌తో దర్శకుడు శశి ఈ చిత్రాన్ని తెరకెక్కించాడు. ప్రస్తుత సమాజంలో పల్లెటూర్లలో ఉన్న కట్టుబాట్లు, సంప్రాదాయం పేరిట ఉన్న ఇలాంటి విచిత్ర ధోరణుల కారణంతో ఎంతో మంది అమ్మల జీవితాలు ఆరంభ దశలోనే ముగిసిపోతున్నాయనే విషయాన్ని ఈ చిత్రంలో చూపించారు. వాసవి జీవితంతో మొదలైన ఈ కథలో ఒంటరి మహిళగా ఆమె సమాజంలో పడే సంఘర్షణ, అమ్మ, కొడుకుల ప్రేమ ఇవన్నీకథను ముందుకు నడిపించాయి. పిల్లలు పెద్దవ్వడం, ఉద్యోగాలు, ప్రేమ, వీటితో పాటు వాసవికి మరో జీవితం ఇవ్వాలనే కొడుకుల ఆలోచన ఇవన్నీ ఆసక్తిగానే కొనసాగుతాయి. కథనం స్లోగా కొనసాగిన భావోద్వేగాలు పండటంతో ప్రేక్షకుడు కథలో లీనమవుతాడు. ప్రథమార్థం సాగదీసినట్లుగా, అక్కడక్కడా బోరింగ్ సన్నివేశాలతో ముగుస్తుంది. ఇక ద్వితీయార్థంలోనూ ప్రేక్షకుడి ఊహించిన కథే జరుగుతుందటంతో పెద్ద ఆసక్తికరంగా అనిపించదు. అయితే కథను నడిపిన విధానం, స్క్రీన్‌ప్లే ఆకట్టుకుంటుంది. వాసవి పెళ్లికి ఎదురయ్యే సమస్యలు, వాటిని కొడుకు వివేక్ ఎలా అధిగమించాడు? ఏడుకొండలు పాత్ర పరిచయం ఈ సన్నివేశాలన్నీ కథను ఇంట్రెస్టింగ్‌గా కొనసాగించేటట్లు చేశాయి.

# 'నాగబంధం' ట్రైలర్ విడుదల-విజువల్స్ అదుర్స్!

-విరాట్ కర్ణ హీరోగా పాన్ ఇండియా చిత్రం 'నాగబంధం'
-విడుదలైన ఆసక్తికరమైన థియేట్రికల్ ట్రైలర్
-అభిషేక్ నామా దర్శకత్వంలో మైథలాజికల్ యాక్షన్ అడ్వెంచర్
-జూలై 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల

విరాట్ కర్ణ హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా మైథలాజికల్ యాక్షన్ అడ్వెంచర్ చిత్రం 'నాగబంధం – ది సీక్రెట్ ట్రెజర్'. ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను శుక్రవారం హైదరాబాద్ లోని ప్రసాద్స్ పీసీఎక్స్ మల్టీప్లెక్స్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఘనంగా విడుదల చేశారు. అభిషేక్ నామా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంపై ట్రైలర్ విడుదల కావడంతో అంచనాలు మరింత పెరిగాయి.ప్రాచీన విష్ణు ఆలయాల సినిమాపై క్యూరియాసిటీని పెంచుతున్నాయి. భారీ విజువల్స్, కవచాలు ధరించిన ఏనుగులు, అత్యున్నత స్థాయి వీఎఫ్‌ఎక్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. అభిషేక్ పిక్చర్స్, నేపథ్యంలో సాగే ఈ కథలో 'నాగబంధం' అనే రహస్య ఆచారాన్ని, నిధి అన్వేషణను ట్రైలర్‌లో ఆసక్తికరంగా చూపించారు. బ్రహ్మ కమలం, అనంత పద్మనాభ స్వామి ఆలయం వంటి అంశాలు ఎన్ఐకే స్టూడియోస్ సంస్థలు సుమారు రూ.100 కోట్ల భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. విరాట్ కర్ణకు జోడీగా నభా నటేష్, ఐశ్వర్య మీనన్ నటిస్తుండగా.. జగపతి బాబు, మహేష్ మంజ్రేకర్, రిషభ్ సాహ్నీ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన 'వరల్డ్ ఆఫ్ నాగబంధం' టీజర్‌కు 35 మిలియన్లకు పైగా వ్యూస్ రావడం విశేషం.






Publisher: AKULA SWATHI , printed at SUNDAY PRINTING PRESS, FLAT. NO.363B,1st FLOOR,MADHAVARAM NAGAR COLONY ,RANGAREDDY, TELANGANA - 500072 .
Published at H.NO.15-56/1, Village & Mandal CHERIAL , SIDDIPET District ,Telangana state - 506223, Editor :THADEM PRASHANTH Cell :9000306455